క్లుప్తంగా

ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకం

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించటంలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని పట్టణంలోని రాచూరి జమీందార్ కోటలో శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ శక్తివంచన లేకుండా సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్తిక మాసంలో సిబ్బందితో పాటు అధికారులు సైతం కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనటం ఐక్యతకు సూచిక అని అన్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ టీకేవీ గుప్త, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, వర్కర్స్ అసోసియేషన్ నాయకులు బాలాజీ, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లేశ్వరుడికి లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు: భట్టిప్రోలు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థాన వంశ పారంపర్య ట్రస్టీ కొడాలి శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాచాబత్తుని వంశీయులచే లక్ష బిల్వార్చన జరుగుతుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి మారేడు దళాలతో లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచాబత్తుని వంశీయులు పాల్గొంటారని తెలిపారు.

ఏకగ్రీవంగా యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శిగా వి.సురేష్‌కుమార్, అధ్యక్షులుగా ఎండీ అల్తాఫ్ హుస్సేన్, గౌరవాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్‌కే బాజీబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

చిల్డ్రన్స్ హోమ్‌లో అన్నదానం



రేపల్లె రూరల్: అనాథలను, వృద్ధులను ఆదుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రేపలె చిల్డ్రన్స్ హోమ్‌లో తన తండ్రి ఆవుల అంకరాజు జ్ఞాపకార్థం గురువారం రాత్రి హోమ్‌లో 50 మంది చిన్నారులు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతా శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకుడు నాయుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మామను హతమార్చిన అల్లుడు



కుటుంబరావు మృతదేహం

నిజాంపట్నం: ఆస్తి కోసం మామను అల్లుడు హతమార్చిన ఘటన నిజాంపట్నం మండలం కోనఫలం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ సురేష్‌బాబు వివరాల మేరకు కోనఫలం గ్రామానికి చెందిన అడుసుమల్లి కుటుంబరావు (55) తన స్వగృహంలో గురువారం తెల్లవారుజామున విగతజీవిగా పడి ఉన్నాడన్నారు. కుటుంబరావు గొంతు కమిలిపోయి ఉండటం, చెవిలో రక్తం కారి ఉండటంతో కుటుంబ సభ్యులు తమకు సమాచారం అందించారన్నారు. దీంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు. అయితే ఆస్తి కోసం రేపల్లె మండలం గాదెవారిపాలెం గ్రామానికి చెందిన అల్లుడు రేపల్లె బాలకృష్ణ హత్యచేశాడని మృతుని సోదరుడు సాంబశివరావు ఫిర్యాదు చేశాడన్నారు. కుటుంబరావును అల్లుడు బాలకృష్ణతో పాటు, మరో ఇరువురు కలిసి గొంతు నులిమి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వసతులు కరువై..!

- శ్లాబు పెచ్చులూడి ప్రమాదభరితంగా వసతి గృహాలు
- అంతంత మాత్రంగా మరుగుదొడ్ల నిర్వహణ
- చిన్నపాటి వర్షానికే గదులలోకి చేరుతున్న నీరు



రేపల్లెలోని ఎస్సీ బాలుర వసతి గృహం

రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వసతి గృహాలు నిరాదరణకు గురవుతున్నాయి. సంక్షేమ వసతి గృహాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఆరు నెలల నుంచి మెస్ చార్జీలు విడుదల కాక వసతి గృహాల అధికారులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో వసతులు కొరవడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేపల్లెలో ఆరు సంక్షేమ వసతి గృహాలు, రెండు గురుకుల పాఠశాలలు ఉండగా నిజాంపట్నంలో ఒక సంక్షేమ వసతి గృహంతో పాటు ఒక గురుకుల పాఠశాల ఉంది. అదే విధంగా చెరుకుపల్లిలో ఒక గురుకుల పాఠశాల ఉంది.

అధ్వాన్నంగా వసతి గృహాల పరిస్థితి

వసతి గృహాలలో కనీస వసతులు లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. పలు మరుగుదొడ్లకు తలుపులు లేకపోవటంతో విద్యార్థులు ఆరు బయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

ఎస్సీ బాలుర వసతి గృహంలోని పలు గదులలో శ్లాబు పెచ్చులూడి చువ్వలు బయటపడ్డాయి. కిటికీల వద్ద ఏర్పాటు చేసి ఉన్న సన్ షేడ్ బల్లలు పూర్తిగా శిథిలం అవ్వటంతో చిన్నపాటి వర్షానికే నీరు గదుల్లోకి చేరుతోంది. దీంతో పాటు శీతాకాలంలో చలిగాలులకు విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నిజాంపట్నం మండలం శింకపాలెం బీసీ- బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మూడు నెలలుగా మంజూరు కాని బిల్లులు

కూటమి ప్రభుత్వం వసతి గృహాలకు బిల్లులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో గత మూడు నెలల నుంచి బిల్లులు మంజూరు కాక ఆయా వసతి గృహాల వార్డెన్‌లపై ఆర్థిక భారం పడుతోంది. విద్యార్థులకు ఆహారం అందించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలోని ఆరు వసతి గృహాలకు సంబంధించి ఆగస్టు నెల నుంచి బిల్లులు మంజూరు కాలేదని పలువురు వార్డెన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు సైతం 10 నెలలుగా విడుదల కాని పరిస్థితి ఉంది. ఒక వసతి గృహానికి నెలకు రూ.1 లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం వసతి గృహాలలో సౌకర్యాలు కల్పించటంతో పాటు సక్రమంగా బిల్లులు మంజూరు చేయాలని విద్యార్థులు, వసతి గృహాల అధికారులు కోరుతున్నారు.



ఎస్సీ బాలుర వసతి గృహంలో అధ్వాన్నంగా ఉన్న మరుగుదొడ్లు



ఎస్సీ బాలుర వసతి గృహం-2లో పెచ్చులూడుతున్న సైడ్‌వాల్స్





బీసీ బాలుర వసతి గృహంలో శ్లాబుకు పెచ్చులూడిన దృశ్యాలు

పూర్తయిన ఫ్లైఓవర్.. రాకపోకలు షురూ



సూరేపల్లి వద్ద నిర్మాణం పూర్తయిన ఫ్లైఓవర్

భట్టిప్రోలు: జాతీయ రహదారి మార్గంలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి రైల్వే గేట్‌పై నిర్మించిన ఫ్లైఓవర్‌పై ఎట్టకేలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. గతంలో ఈ ఫ్లైఓవర్ పక్కనే ఉన్న రహదారి మార్గంలో రాకపోకలు జరిగేవి. ఈ గేటు రైలు రావడానికి అరగంట ముందుగానే మూసివేయడంతో వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో గేటుకు ఇరువైపులా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొనేది. పరిస్థితి కుదుటపడటానికి చాలా సమయం పట్టేది. ప్రస్తుతం ఈ సమస్య తొలగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయింది. ఫ్లై ఓవర్‌ను అధునాతన టెక్నాలజీతో రూపొందించి సుందరంగా తీర్చిదిద్దడంతో దీని పైన వచ్చి పోయే ప్రయాణికులు, యువత ఫొటోలు దిగుతున్నారు. మరికొందరు సరదాగా సెల్ఫీలు తీసుకుంటున్నారు.

వంతెన నిర్మాణానికి ప్రణాళికలు



అన్నవరపులంక వద్ద కృష్ణానదిలో వంతెన నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లిపర: మండల పరిధిలోని అన్నవరపు లంక గ్రామానికి ప్రజలు కృష్ణానదిలో నుంచి వెళ్లాల్సి ఉంది. ఈక్రమంలో కృష్ణా నదికి వరదలు వచ్చిన సమయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ పనులు, వ్యాపారాలు ముగించుకొని గ్రామస్తులు పడవల ద్వారా గ్రామంలోకి రాకపోకలు చేస్తుంటారు. వరదలు సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుండడంతో ప్రజలు ఇటీవల వచ్చిన వరదలు సమయంలో కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు గ్రామంలో పర్యటించినప్పుడు వంతెన నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. దీంతో వారు స్పందించి వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వంతెన నిర్మాణం కోసం కృష్ణానది కరకట్ట నుంచి నదిలో అన్నవరపు లంక గ్రామం వరకు రూ.70 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం కోసం ప్రణాళికలు పరిశీలించారు. ఎక్కడ నుంచి ఎక్కడవరకు వంతెన నిర్మాణం జరగాలి, ఏ విధంగా నిర్మాణ పనులు చేపట్టాలి, ఎంత మేరకు ఖర్చు అవుతుంది అన్న విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మృత్యుంబాబు, పంచాయతీరాజ్ డీఈ ఎం.కృష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈలు, బి.కిషోర్‌రెడ్డి, అవుతు సాంబిరెడ్డి, వరంగల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శంకర్, సాయిల్‌టెస్ట్ డిజైనర్ నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పద్యగాన పోటీలు

విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, అర్హత పొందిన 90 మందికి అభినందన పత్రం

తెనాలి: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పద్యగాన పోటీలను నిర్వహిస్తున్నారు. మూడు వయసు విభాగాలతో పద్యగాన పోటీలను రెండు దఫాలుగా జరిపి, ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.3,116, ద్వితీయ బహుమతిగా రూ.2,116, తృతీయ బహుమతిగా 1,116, ప్రతి విభాగంలో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతిగా రూ.516 నగదును ఇస్తారు. విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, అర్హత పొందిన 90 మందికి అభినందన పత్రం అందజేస్తామని ప్రకటించారు. 6-10 ఏళ్ల వయసుగల చిన్నారులను ప్రహ్లాద విభాగం, 11-15 ఏళ్ల వయస్కులకు మార్కండేయ విభాగంగా, 16-20 ఏళ్ల యువతీయువకులను వివేకానంద విభాగంగా నిర్ణయించారు. పోటీల్లో పాల్గొనేవారు ఏదైనా ఒక పద్యాన్ని రాగయుక్తంగా పాడిన వీడియోను పేరు, వయసు, తరగతి, ఊరు, ఫోన్ నెంబరుతో సహా చెప్పి ఈనెల 25వ తేదీలోగా డాక్టర్ ఎస్ ఆర్‌ఎస్ కొల్లూరి (9247272066)కు వాట్సాప్‌లో పంపాలి. ప్రాథమిక పరిశీలనలో ఒక్కో విభాగంలో 30 మంది చొప్పున 90 మందిని ఎంపిక చేసి, ఈనెల 30న తెలియజేస్తారు. వీరంతా డిసెంబరు 9వ తేదీన గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఒక్కొక్కరు మూడేసి పద్యాలను గానం చేయాల్సి వుంటుంది. ఒక్కొక్కరికి అయిదేసి నిముషాలు కేటాయిస్తారు. కావాల్సినవారు సంస్థ ఏర్పాటుచేసిన సహ వాయిద్యాలను ఉపయోగించుకోవచ్చునని వివరించారు.

పరమేశ్వరుడికి అన్నాభిషేకం



తెనాలి: పవిత్ర కార్తికమాసం పురస్కరించుకుని స్థానిక గంగానమ్మపేటలోని చారిత్రక ప్రాముఖ్యత కలిగిన శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో పరమేశ్వరుడికి గురువారం అన్నాభిషేకం నిర్వహించారు. పట్టణానికి చెందిన పెసర్లంక వెంకటరమణ, కల్పన దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, జలగం రామకృష్ణ, కుర్రా శ్రీను, ధర్మేంద్ర, చిట్టిబాబు, నాగేశ్వరరావు, ఆలయ ఈవో వీవీ రమణకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

26న గుంటూరులో బహిరంగ సభ



ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

తెనాలి: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న గుంటూరులో జరగనున్న ర్యాలీ, సభను జయప్రదం చేయాలని స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం విజ్ఞప్తి చేసింది. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సీఐటీయూ తెనాలి డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక ప్రస్తుతం చేతికందిన పంట కారు చౌకగా అమ్ముకోవలసిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బాబూప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదార్లకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నదని, కార్మిక వర్గానికి ఎటువంటి హక్కులు లేకుండా యాజమాన్యం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పర్మినెంట్ ఉద్యోగాలు లేవనీ, కనీస వేతనాలు అమలు చేయటం లేదనీ, పన్నెండేళ్లుగా కోట్లాది మంది కార్మికులకు వేతనాలలో ఎదుగుదల లేక, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక అప్పులపాలవుతున్నట్టు చెప్పారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలు ఇచ్చినా వాటిని అమలు చేయటం లేదన్నారు. ఏఐటీయూసీ నాయకుడు ఎస్.గురుబ్రహ్మం మాట్లాడుతూ విద్యుత్ సవరణ చట్టం అమల్లోకి రాకుండా చూడాలని కోరారు. మాగంటి యలమందయ్య, ఎం.సాంబశివరావు, కె.రవికుమార్, ఎస్.రాజ్యలక్ష్మి, ఎం.శివ ఏవీఎస్ కుమారి, కళాధరి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకు కూడా పింఛన్ తీసుకోవచ్చు

ఎంపీడీఓ వి.విజయలక్ష్మి

కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల పెన్షన్ తీసుకునే లబ్ధిదారులు అనివార్య కారణాల వలన రెండు నెలలు వరకు పింఛన్ తీసుకోలేక ఉన్నవారు మూడవ నెలలో పింఛన్ తీసుకునే వెలుసుబాటు ఇకనుంచి కల్పించిందని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు వరుసగా రెండు నెలలు తీసుకోకపోతే మూడో నెలలో లబ్ధిదారుని పింఛను కనిపించేది కాదని ఇకనుంచి రెండు నెలలు తీసుకోకపోయినా మూడవ నెలలో రెండు నెలలు కలిపి మూడు నెలల పింఛన్ సొమ్మును తీసుకోవచ్చని తెలిపారు. మూడు నెలలు దాటితే పెన్షన్ జాబితాలో వారి పేరు కంప్యూటర్ ద్వారా లాక్ చేయడం జరుగుతుందని తెలిపారు. పెన్షన్ దారులు తప్పని పరిస్థితుల్లో మాత్రమే ఈ విధంగా పెన్షన్ తీసుకోవాలని సూచించారు.

కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: స్వచ్ఛంద్ర కార్పొరేషన్ వారు తెనాలి మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న ఎనిమిది మంది కార్మికులకు పంపిన తొమ్మిది రకాల పీపీఈ కిట్లను గురువారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్నలు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కిట్లు, మాస్కులు, ప్రత్యేక డ్రస్సు, గ్లౌజులు, షూలు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని ధరించి పారిశుద్ధ్య నిర్వహణ చేయడం వలన అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. అందరూ వీటిని ధరించాలని సూచించారు. ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుమూడి ఇసుక రీచ్‌కు అనుమతులేవు

- ఇసుకను అక్రమంగా తవ్వితే చర్యలు తప్పవు
- తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరిక



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: మండలంలోని పెనుమూడి గ్రామం పల్లెపాలెం గ్రామంలో ఇసుక రీచ్‌లకు ఎటువంటి అనుమతులు లేవని, అక్రమంగా తవ్వితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు హెచ్చరించారు. పెనుమూడి గ్రామంలోని కృష్ణానది ఒడ్డున అక్రమంగా ఇసుక తవ్వుతున్నారంటూ సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'పెనుమూడి రేవులో అక్రమంగా ఇసుక తవ్వకాలు' కథనానికి స్పందించి పట్టణ సీఐ మల్లికార్జునరావుతో కలిసి గురువారం రీచ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రీచ్‌కు ఎటువంటి అనుమతులు లేకపోవటంతో నిలుపుదల చేయటం జరిగిందన్నారు. ఇక్కడ అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. ఎటువంటి వారిపైనైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రీచ్‌ల వద్ద రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, ఎవరైనా ఇసుకను తవ్వినట్లు సమాచారం అందితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామంలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధికి ఎన్‌పీసీఐ మ్యాపర్ అనుసంధానం తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో అనుసంధానం చేస్తున్న పోస్టల్, సచివాలయ సిబ్బంది

రేపల్లె రూరల్: నగదు బదిలీ పద్ధతి (డీబీటీ) ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిని లబ్ధిదారు పొందేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మ్యాపర్‌లో లబ్ధిదారు వివరాలు అనుసంధానం కాబడి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 4, 5 వార్డుల సచివాలయంలో, ముమ్మలనేనివారిపాలెం, గరికవాటి వీధిలోని సచివాలయంలో పోస్టల్ సిబ్బంది గురువారం నిర్వహించిన ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్‌పీసీఐకు అనుసంధానం కాబడని వారు అర్హత ఉన్నా లబ్ధిని పొందలేకపోతున్నారని చెప్పారు. ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో లబ్ధిదారుల ఆధార్ కార్డుకు అకౌంట్ నంబరు జత చేసి ఉంటే సమస్య ఉండదని చెప్పారు. లబ్ధిదారులు వెంటనే సచివాలయాలలో ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో అనుసంధానం చేసుకుని లబ్ధిని పొందాలని చెప్పారు. కార్యక్రమంలో రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు, ఎంవోలు నరేంద్ర, కిరణ్, బీపీఎం, ఏబీపీఎంలు, పోస్ట్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



దేవదాసు కుటుంబానికి పోస్టల్ బాండ్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భట్టిప్రోలు: జీవితానికి తొలి మెట్టు... చదువుల గుడి... పూర్వ విద్యార్థులు అందరు కలసి తమ ఉదారతను చాటుకున్నారు. అందరూ కలసికట్టుగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలని నిర్ణయించుకున్న భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్ 1987-88 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారు మైత్రి విద్యా సేవా సమితిని ఏర్పాటు చేసుకుని తమ బ్యాచ్‌లోని స్నేహితుల్లో ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు కృషి చేస్తున్నారు. ఇటీవల మృతి చెందిన గుంటూరు దేవదాసు కుటుంబాన్ని బాల్య స్నేహితులు గురువారం పరామర్శించి వారి పిల్లల చదువు నిమిత్తం రూ.లక్ష పోస్టల్ బాండ్లు, రూ.5 వేలు నగదు అందించి అండగా నిలిచారు. ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు బీహెచ్.ఉషారమణి, ఉపాధ్యక్షులు టి.దేవాజీ, కార్యదర్శి పి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి పి.రమణ, కోశాధికారి విజయసారధి, కమిటీ సభ్యులు పీవీ రమణారావు, ఆంజనేయులు, ఎ.సురేంద్ర, ఏఎస్‌వీ సుబ్బారావు, రజనికుమారి, సలీముద్దీన్, ఎస్.శ్రీనివాస్, హేమ వరప్రసాద్ తండ్రి కంచె రమేష్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలో శిక్షణ అవసరం



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక

ఫిరంగిపురం: మహిళల ఆత్మరక్షణకు మెళకువలు ఎంతో అవసరమని యువజన సర్వీసుల శాఖ(స్టెప్)బి.రాధిక అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో గురువారం యువజన సర్వీసుల, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ అబ్యూస్, ఈవ్ టీజింగ్, సెల్ఫ్ డిఫెన్స్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ కళాశాలలో, పరిసరాలల్లో ఈవ్ టీజింగ్ పాల్పడటం ద్వారా సమాజంలో గౌరవాన్ని కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్, ఏఎస్ఐ పీఏఖాన్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, డి.జీవన్ మణిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



పొన్నూరు: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ బొమ్మ వద్ద గురువారం వలంటీర్లు ఆందోళన చేశారు. నల్ల రిబ్బన్లను కళ్లకు కట్టుకుని నిరసన తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దె వెంకట భవాని ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ జాని, గోపి, బాజీ, మహేశ్వరి, పర్వీన్, వలంటీర్స్ అసోసియేషన్ పట్టణ గౌరవాధ్యక్షులు ఆరేటి రామారావు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



ప్రత్తిపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో అన్నదమ్ములు షేక్ జాన్ సాహెబ్, షేక్ చిన్నబాబు, పెద్దబాబు, షేక్ మహబూబ్ సుభానీలు నివాసముంటున్న పెంకుటిల్లు బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఆయా పోర్షన్లలో ఉన్న విలువైన వస్తువులు, సామాన్లు, పత్రాలు, ఎలక్ట్రికల్ సామానులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందించడంతో గుంటూరు-2 ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.